క్లుప్తంగా

బ్రిడ్జిపై ప్రమాదాల నివారణకు చర్యలు



మునగపాక గ్రామంలోకి వచ్చే బ్రిడ్జిపై ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన గోడ

మునగపాక: పూడిమడక రోడ్డు నుంచి మునగపాక గ్రామంలోకి వెళ్లే బ్రిడ్జి రెయిలింగ్ ప్రమాదకరంగా మారింది. ఒక చోట రెయిలింగ్ పాడైపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే దెబ్బతిన్న రెయిలింగ్ కారణంగా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సామాజిక కార్యకర్త దాడి సాంభశివ ముందుకొచ్చి ఇటుకలతో చిన్న గోడ కట్టించి మానవత్వం చాటుకున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నక్కపల్లి: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా దేవవరం గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. తొలి రోజు మహిళలకు ముగ్గుల పోటీలు, రెండో రోజు యువకులకు కబడ్డీ, బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఉట్టి కొట్టే సంబరంలో విజేతగా నిలిచిన యువకుడికి రూ. 3వేలు విలువైన వెండి కృష్ణుని విగ్రహాన్ని కానుకగా అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం లక్ష్మీనారాయణ

కోటవురట్ల: పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన పోతల కామాక్షిదేవి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఒంగోలు ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో హెచ్ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ బి.అచ్యుతరావు, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ పట్టుదలతో చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కామాక్షిదేవిని ఆదర్శంగా తీసుకుని మిగతా విద్యార్థులు బాగా చదివి మంచి స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.

మరిడిమాంబ ఉత్సవం నేడు



మరిడిమాంబ అమ్మవారు

కోటవురట్ల: వరాహ నది తీరాన కొలువుదీరిన శ్రీమరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. గ్రామం అంతా విద్యుద్దీపాలంకరణ చేశారు. వేకువ జాము నుంచి ఆలయంలో దర్శనాలు కల్పిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించాలి

మునగపాక: ఓటరు నమోదుపై దృష్టి సారించాలని రీసర్వే డీటీ పడాల్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి, 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. ఓటరు జాబితాల్లో చేర్పులు, మార్పులపై కూడా దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు బాధ్యతగా పని చేయాలని సూచించారు.

వైద్యులకు భద్రత అవసరం



విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడులు సర్వ సాధారణంగా మారింది. ముఖ్యంగా మహిళా వైద్యులకు భద్రత లేదు. ప్రభుత్వాలు తక్షణమే ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రి వద్ద పోలీసు ఔట్‌పోస్టులు ఏర్పాటు చేయాలి. సంఘటనలు జరిగినప్పుడే స్పందించడం కాదు. జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. నిందితులకు శిక్ష పడేలా ఫాస్టాక్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ శిరీష, సూపరింటెండెంట్, నక్కపల్లి ఏరియా ఆస్పత్రి

నిందితులను కఠినంగా శిక్షించాలి



వైద్య రంగంలో ఎక్కువగా మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు. రాత్రి సమయంలో పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించే సిబ్బందికి భద్రత కల్పించాలి. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటనకు బాధ్యులను చట్ట ప్రకారం శిక్షించాలి.

– డాక్టర్ డి.సుభాష్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పాయకరావుపేట

నక్కపల్లి/పాయకరావుపేట

చరిత్ర.. శిథిలం



తుప్పల్లో ఉన్న బుద్ధుని విగ్రహం



మామిడి చెట్ల పై నిర్మించిన వసతి గది దుస్థితి



పార్కులో శిథిలమైన కళా ఖండాలు

- కళా విహీనం.. అంబేడ్కర్ పార్కు
- శిథిలమైన మహానుభావుల విగ్రహాలు

పాయకరావుపేట: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కు శిథిలావస్థకు చేరింది. అటువైపు సందర్శకులు వెళ్లకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. పట్టణంలో మండల పరిషత్ కార్యాలయాల ఆవరణ వెనక సుమారు 4 ఎకరాలలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పార్కును నిర్మించారు. 2002లో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ఆర్.మల్లికార్జునరావు నేతృత్వంలో పార్కును శ్రమదానంతో సుందరంగా రూపొందించారు. పార్కులో అంబేడ్కర్ జ్ఞాపకాలు, ఆయనకు సంబంధించిన చిత్ర పటాలతో ప్రత్యేక భవనంలో మ్యూజియం సైతం ఏర్పాటు చేశారు. పార్కులో మూడు వైపులా కార్యాలయాలకు ఉపయోగపడేలా గదులు నిర్మాణం చేపట్టారు. బుద్ధుడు, అంబేడ్కర్ విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. పార్కులో సమావేశాల నిర్వహణకు అనువుగా ప్రత్యేక స్థలంతో పాటు వేదికను కూడా ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఎక్కడికక్కడ చెట్ల కింద పెద్ద అరుగులు కట్టి జారుడు బల్లలు నిర్మాణం చేపట్టారు. వాటర్ పాల్స్ ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ ప్రహరీపై చరిత్ర తెలిసేలా బొమ్మలు గీయించి, వాటి సారాంశాలను గోడలపై చెక్కారు. పిల్లలు రైలు ఎక్కి ప్రయాణించే అనుభూతి కలిగేలా రైలు బండిని నిర్మించి రంగులతో అలకరించారు. మండల పర్యటనకు వచ్చిన జిల్లా అధికారుల సౌకర్యార్థం పార్కులో అతిథి గృహం నిర్మించారు. పూల చెట్లు, పూల మొక్కలు, రంగు రంగుల బొమ్మలతో పార్కు నందనవనాన్ని తలపించేది. అప్పుడు సందర్శకులకు ఉదయం, సాయంత్రం వేళల్లో నామమాత్రం టిక్కెట్ వసూలు చేసి పార్కులోకి అనుమతించేవారు. ఈ రుసుంను కూడా పార్కు అభివృద్ధికి, సంరక్షణకు వెచ్చించేవారు. అలా సుమారు కొన్నాళ్ల పాటు పార్కు నిర్వహణ సజావుగా సాగింది. 15 ఏళ్లుగా పార్కు కాలక్రమంగా శిథిలావస్థకు చేరుకుంది. సాంఘిక సంక్షేమ శాఖ పార్కును నిర్లక్ష్యం చేసింది. పార్కు ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. విగ్రహాలు శిథిలమైపోయాయి. ప్రహరీ కూడా 2 చోట్ల కూలిపోయింది. పార్కు మొత్తం కళావిహీనంగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించినా ఇంత వరకు ఎటువంటి స్పందన లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విశాఖకు చెందిన వుడా అధికారులు పార్కును పరిశీలించారు. పార్కును అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్కులో ఉన్న 11 మామిడి చెట్ల నుంచి ప్రతి సంవత్సరం ఫలసాయంగా రూ.35 వేలు ఆదాయం వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ ఓ.పి.జయలక్ష్మిని సంప్రదించగా.. పార్కు అభివృద్ధికి ఏవిధమైన నిధులు మంజూరు కాలేదన్నారు. తమ కార్యాలయం కూడా పార్కులోనే నిర్వహిస్తున్నామని, అది కూడా శిథిలామైపోయిందని చెప్పారు. పార్కు అభివృద్ధి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



అధ్వానంగా పిల్లలు ఆడుకునే ప్రాంగణం



శిథిలమైన గదులు



కళావిహీనంగా సమావేశాలు నిర్వహించే వేదిక



మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్లు

తిమ్మరాజుపేట అభివృద్ధికి సహకరించాలి



తిమ్మరాజుపేటలో పారిశుధ్యం పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ కృష్ణారావు

మునగపాక: తిమ్మరాజుపేట గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు కోరారు. అందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. తిమ్మరాజుపేటలో బుధవారం పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో ఎటువంటి రోగాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కాండ్రేగుల జగన్‌మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

మునగపాక(అచ్యుతాపురం): కనకదుర్గ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. గతంలో కార్యదర్శి, కోశాధికారిగా పనిచేసిన ప్రకాశరావు, రమణ రాజీనామా చేయగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అడిగర్ల దేముడు, కార్యదర్శిగా ప్రగడ కొండలరావు, కోశాధికారిగా ప్రగడ నాగేశ్వరరావు(ఎల్‌బసీ), ఉపాధ్యక్షుడిగా లాలం చిన సత్యం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులంతా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు.

‘విద్యుత్’ అమరులకు నివాళి



అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగపాక(అచ్యుతాపురం): విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన యువకుల త్యాగాలను వృథా కానివ్వమని సీపీఎం సీనియర్ నాయకుడు కర్రి అప్పారావు అన్నారు. అచ్యుతాపురంలో బుధవారం అమరవీరుల చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని బషీరాబాద్ విద్యుత్ పోరాటంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన చేస్తే అప్పటి ప్రభుత్వం పోలీసులతో కాల్పులకు తెగబడిందని గుర్తుచేశారు. నేడు మళ్లీ విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి స్మార్ట్‌మీటర్లు పేరుతో ప్రజలపై భారం పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దుయ్యబట్టారు. విద్యుత్ ధరలు తగ్గించి ప్రజలపై భారం లేకుండా చూడాలన్నారు. లేదంటే మరోసారి విద్యుత్ పోరాటాలకు సిద్ధం కాకతప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమునాయుడు, చిన్నారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

తీరం పటిష్టతకు చర్యలు తీసుకోవాలి



పూడిమడక ఇసుక తిన్నెలను పరిశీలిస్తున్న మత్స్యకారులు

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర తీర ప్రాంతం కోతకు గురికాకుండా చూడాలని జిల్లా మత్స్యకార నాయకులు, మాజీ ఉప సర్పంచ్ చోడపల్లి అప్పారావు కోరారు. బుధవారం తీరప్రాంతాన్ని వైస్ ఎంపీపీ వాసుపల్లి శ్రీనివాసరావు, మైలపల్లి పోలరాజులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతం కోతకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పూడిమడక మత్స్యకారుల సౌకర్యార్థం జెట్టీ రోడ్డు నిర్మాణాన్ని మార్పు చేసి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కనకమహాలక్ష్మి ఆలయ గోపురం పనులకు శ్రీకారం



ఆలయ గోపురం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: జిల్లాలో పేరొందిన యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ గోపురం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ బుధవారం శ్రీకారం చుట్టారు. రూ.33 లక్షల నిధులతో పట్టణంలోని ధర్మవరంలో కొలువుదీరిన అమ్మవారి ఆలయానికి గోపుర నిర్మాణ పనులు చేపట్టడానికి ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఈ పనులకు శంకుస్థాపన చేశారు.

పెద్దాపురానికి చెందిన శిల్పులు గోపురానికి కావాల్సిన దేవతామూర్తుల రూపాలను ఏర్పాటు చేస్తారని, వచ్చే ఏడాది మార్చికల్లా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొఠారు కొండబాబు, మాడుగుల సత్యనారాయణ, కొఠారు ప్రకాష్, కొఠారు నరేష్, కొఠారు శ్రీను, ఆవాల నారాయణరావు, తాటిపాకల మాణిక్యాలరావు, తాటిపాకల చిన్ని, ప్రగడ నాగేశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



పట్టణంలో ప్రధాన రహదారిపై తొలగించిన చెట్టు కొమ్మలు

యలమంచిలి రూరల్: పట్టణంలో పలు వీధుల్లో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం బుధవారం చేపట్టారు. ప్రధాన రహదారి పక్కన విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మల్ని కాంట్రాక్టు సిబ్బంది నరికివేశారు. గాలులు వీచే సమయంలో చెట్ల కొమ్మలు వైర్లకు తగులుతుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. దీంతో ప్రతి నాలుగు నెలలకొకసారి చెట్ల కొమ్మల నరికివేత చర్యలు చేపడుతున్నారు. ఈ పనుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి టౌన్–1 ఫీడర్ విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా గురువారం మండలంలోని కొత్త ఎర్రవరం, లైనుకొత్తూరు, లైను కొత్తూరు కాలనీ, సోమన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వాడ్రాపల్లిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మునగపాక: వాడ్రాపల్లిలో బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. పెతకంశెట్టి జోగినాయుడు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా వాలీబాల్, క్యారెమ్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం రాత్రి బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డేడ సత్యనారాయణ, కొయిలాడ దశావతారం, మళ్ల వరహా నరసింగరావు, కమిటీ అధ్యక్షులు మళ్ల జోగినాయుడు, మళ్ల కన్నుంనాయుడు, రవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు



ఆక్రమణ నోటీసు అందిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

కోటవురట్ల: ముగ్గురు ఆక్రమణదారులకు పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారం రోజుల్లో ఆక్రమణలను తొలగించాలని పేర్కొన్నారు. ఆర్టీసీ మినీ కాంప్లెక్స్ ఎదుట మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న గెడ్డ కాలువను ఆక్రమించిన ఆడారి భారతి, జానకి సూకరాజు, దొడ్డిగల్లు శ్రీనుకు నోటీసులు ఇచ్చినట్టు పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. వారం రోజుల్లో ఖాళీ చేయకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

మునగపాక: మునగపాకలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సంతబయలు శ్రీబాలల యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కళాకారులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. ఈ ప్రదర్శన తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



కోలాటం ఆడుతున్న కళాకారులు

మాజీ సర్పంచ్ రమణారావు మృతి బాధాకరం



వెంకట రమణారావు చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: ఒంపోలు మాజీ సర్పంచ్, పీఏసీఎస్ విశ్రాంత సీఈవో బొడ్డపు వెంకట రమణారావు మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. ఒంపోలులో బుధవారం రమణరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంపోలు గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేసిన వెంకట రమణారావు మృతి తీరని లోటన్నారు. మాజీ సర్పంచ్ బొడ్డపు శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ నాయకులు మళ్ల ఉమామహేశ్వరరావు, మళ్ల కాశీ సురేష్, పిల్లి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ముందుగా రమణారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణంపై చర్చ



సమావేశమైన పలు రాజకీయ పార్టీల నేతలు

మునగపాక: తోటాడ పంచాయతీలోని మరిడిమాంబ అమ్మవారి ఆలయ నిర్మాణంపై పలు రాజకీయ పార్టీల నేతలు బుధవారం చర్చించారు. తోటాడ, గవర్ల అనకాపల్లికి చెందిన నేతలంతా సమావేశమై ఆలయ మండపంతో పాటు ప్రహరీకి అవసరమయ్యే నిధుల మంజూరుకు ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి ఆలయ నిర్మాణానికి నిధుల సేకరణ చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, పెద్దలు దొడ్డి రమేష్, చదరం భాస్కరరావు, పొలమరశెట్టి జగదీష్, మురళీ, రమేష్ నాయుడు, మళ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి వినతి



మంత్రి జనార్దన్‌కు వినతి అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌ను బుధవారం యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఇందుకు మంత్రి జనార్దన్ సానుకూలంగా స్పందించారని విజయకుమార్ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజుల రిలే నిరాహార దీక్షల్లో భాగంగా రెండో రోజైన బుధవారం దీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సర్వే ద్వారా విద్యార్థులు చాలా దయనీయ పరిస్థితుల్లో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కొన్ని వసతి గృహాలు వర్షానికి కారిపోతూ విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ఉన్నాయన్నారు. అటువంటి వాటిని తక్షణం పునర్నిర్మించాలన్నారు. అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు, గదులు లేక అవస్థలు పడుతున్నార న్నారు. గిరిజన వసతి గృహాల్లో ఉద్యోగులను సరిపడినంత భర్తీ చేయకపోవడం వల్ల విద్యార్థుల మెస్ చార్జీల నుంచి వర్కర్లకు జీతాలు ఇస్తున్నారని, దీనివల్ల విద్యార్థులకు సరైన భోజనం అందట్లేదని వాపోయారు.